ఇబ్నెఅలీ

***హృదయం మానవ శరీరంలో అతి ముఖ్యమైన భాగం. హృదయం సరిగా పనిచేస్తేనే శరీరమంతా ఆరోగ్యంగా ఉంటుంది. మనిషి ప్రతి పని సక్రమంగా చేస్తాడు. అదే హృదయం కొంచెం నలతగా ఉంటే మనిషి కుదేలైపోతాడు. ఏ పనీ సక్రమంగా చేయలేడు. కనుక ఈ హృదయానికి ప్రశాంతత ఎంతో అవసరం. మరలాంటి ప్రశాంతత ఎలా లభిస్తుంది?***

# నా 'హృదయం'లో...




మనిషి హృదయం ఎప్పుడూ ఒకేలా ఉండదు. పరిస్థితులనుబట్టి, అవసరాలను బట్టి మారుతుంది. కొందరు తమ వైఖరులను, ప్రవర్తనలను బట్టి పాషాణ హృదయులుగా, కఠిన హృదయులుగా తెచ్చుకుంటే, మరికొందరు కరుణా హృదయులుగా, జాలి హృదయులుగా గుర్తింపు పొందుతారు కూడాను.

ఇలాంటి పలు రకాల హృదయాల గురించి అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో పలుచోట్ల పేర్కొన్నాడు: అవిశ్వాసుల హృదయాలను పాషాణ హృదయాలు, పాపభూయిష్ట హృదయాలు, వక్ర హృదయాలు, అహంకార హృదయాలు, అంధ హృదయాలు అని పేర్కొన్నాడు. విశ్వాసుల హృదయాలను మంచి హృదయాలు, కంపించే హృదయాలు, సంతృప్తి చెందే హృదయాలు, విజ్ఞతగల హృదయాలు అని వర్ణించాడు. ఏ హృదయాలు ఎలాంటివో తెలుసుకోండి...

## పాషాణ హృదయాలు

ఈ సూచనలను (అల్లాహ్ సూచనలను) చూసిన తరువాత కూడా మీ హృదయాలు కఠినమైపోయాయి. పాషాణాల మాదిరిగా, కాదు వాటికంటే కూడా కఠినమైపోయాయి. ఎందుకంటే రాళ్ళల్లో కొన్నింటినుండి సెలయేళ్ళు ప్రవహిస్తాయి. కొన్ని పగలగా వాటి నుండి నీరు చిమ్ముతుంది. మరికొన్ని అల్లాహ్‌కు భయపడి కంపించి నేలకొరుగుతాయి. జాగ్రత్త! మీరు చేస్తున్నదంతా అల్లాహ్‌కు తెలియకుండా లేదు.

(సూరెబఖర- 74)

## పాప భూయిష్ట హృదయాలు

ఎట్టి పరిస్థితుల్లోనూ సాక్ష్యాన్ని దాచకండి. సాక్ష్యాన్ని దాచేవాడి హృదయం పాపభూయిష్టమైనది. మీరు చేసేవన్నీ అల్లాహ్‌కు తెలుసు.

(సూరె బఖర - 283)

## వక్ర హృదయాలు

వక్ర మనస్సులు (హృదయాలు) కలతలను రేపేందుకు ఎల్లప్పుడూ 'ముతషాబిహాత్' వెంటపడి వాటికి అర్థాలు తొడిగే ప్రయత్నం చేస్తారు. కాని వాటి అసలు అర్థాన్ని అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఎరుగరు.

(సూరె ఆలి ఇమ్రాన్ -7)

## విజ్ఞతగల హృదయాలు

యదార్థం ఏమిటంటే, ఏ విషయాన్నుండైనా విజ్ఞతగల వారే (హృదయాలే) గుణపాఠం నేర్చుకుంటారు. వారు అల్లాహ్‌ను ఇలా ప్రార్థిస్తారు :

'ప్రభూ! నీవు మాకు సరైన మార్గాన్ని చూపావు. ఇక మా మనస్సులను వక్రమార్గం వైపునకు మళ్ళించకు. నీ కారుణ్య నిధి నుండి మాకు కారుణ్యాన్ని ప్రసాదించు. (ఆలి ఇమ్రాన్ -8)

## ఆలోచించని హృదయాలు

చాలామంది జిన్నులను, మానవులనూ మేము నరకం కోసమే సృష్టించాము. ఇది యదార్థం. వారికి హృదయాలున్నాయి. కాని వారు వాటితో ఆలోచించరు. వారికి చెవులున్నాయి కాని వారు వాటితో వినరు. వారు జంతువుల వంటి వారు. కాదు వాటికంటే కూడా దిగజారిపోయారు. అలక్ష్యంలో మునిగి ఉన్నవారు వీరే. (అల్ ఆరాఫ్ : 179)

## కంపించే హృదయాలు

నిజమైన విశ్వాసుల హృదయాలు అల్లాహ్ ప్రస్తావన విన్నంతనే భయంతో కంపిస్తాయి. వారి సమక్షంలో అల్లాహ్ ఆయతులు పారాయణం చెయ్యబడినప్పుడు వారి విశ్వాసం పెరుగుతుంది. వారు తమ ప్రభువు పట్ల నమ్మకం కలిగి ఉంటారు. (అన్‌ఫాల్ : 2)

## ముద్ర వేయబడిన హృదయాలు

ప్రవక్తలు వారి (జాతి) వారివద్దకు స్పష్టమైన నిదర్శనాలను తీసుకువచ్చారు. కాని వారు మొదట తిరస్కరించిన విషయాన్ని మళ్ళీ విశ్వసించలేదు. ఈ విధంగా మేము హద్దులను అతిక్రమించే వారి హృదయాలపై ముద్ర వేస్తాము. (సూరె యూనుస్ : 74)

## తృప్తిచెందే హృదయాలు

తెలుసుకోండి! అల్లాహ్ సంస్మరణ ద్వారానే హృదయాలకు తృప్తిని పొందే భాగ్యం లభిస్తుంది. (సూరె రఅద్ : 28)

## అదిరిపోయే హృదయాలు

ఓ ప్రవక్తా! అణుకువగల వైఖరిని అవలంభించే వారికి శుభవార్తను అందజెయ్యి. వారి పరిస్థితి ఎలా ఉంటుందంటే, అల్లాహ్ ప్రస్తావన విన్నప్పుడు వారి గుండెలు అదిరిపోతాయి. వారి మీదకు ఏ ఆపద వచ్చిపడినా దానికి వారు ఓరిమి వహిస్తారు, నమాజ్‌ను స్థాపిస్తారు. మేము వారికి ఇచ్చిన ఉపాధి నుండి ఖర్చు పెడతారు. (అల్ హజ్- 35)

## అంధ హృదయాలు

పాపాల పుట్టలైన ఎన్నో జనపదాలను మేము నాశనం చేశాము. ఈనాడు అవి తమ కప్పులపై తలకిందులుగా పడి ఉన్నాయి. ఎన్నో బావులు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఎన్నో ఎత్తైన భవనాలు శిథిలాలుగా మారిపోయాయి. వారు భూమిపై సంచరించలేదా వారి హృదయాలు అర్థం చేసుకోగలవిగా, వారి చెవులు వినగలవిగా కావటానికి? యదార్థం ఏమిటంటే, కళ్ళు గుడ్డివి అవవు, కాని వక్షముల లోపుల ఉన్న హృదయాలు మాత్రం అంధమైపోతాయి.

(అల్ హజ్ : 45,46)

*ప్రళయదినం నాడు సంపద వల్ల గానీ, సంతానం వల్ల గానీ ఏ లాభమూ కలగదు. ఏ వ్యక్తి అయినా మంచి హృదయంతో అల్లాహ్ సాన్నిధ్యంలో హాజరైతే తప్ప.*

### అవిశ్వాస హృదయాలు

ఒక్క అల్లాహ్‌ను గురించి మాత్రమే ప్రస్తావించడం జరిగినప్పుడు, పరలోకం పట్ల విశ్వాసంలేని వారి హృదయాలు బాధపడతాయి. ఆయనను తప్ప ఇతరులను గురించి ప్రస్తావించటం జరిగినప్పుడు, యకాయకి వారి ముఖాలు సంతోషంతో వెలిగిపోతాయి.

(సూరె జుమర్- 45)

### విశ్వాసుల హృదయాలు

విశ్వాసుల హృదయాలు అల్లాహ్ ప్రస్తావనతో చలించే సమయం, ఆయన అవతరింపజేసిన సత్యం ముందు వంగిపోయే సమయం ఇంకా రాలేదా? పూర్వం గ్రంథం ఇవ్వబడిన ప్రజల మాదిరిగా వారు మారిపోకూడదు. ఒక సుదీర్ఘ కాలం వారిపై గడిచిపోయింది. అప్పుడు వారి హృదయాలు కఠినమయ్యాయి. (అల్ హదీద్ : 16)

## మంచి హృదయాలు

ఆరోజు (ప్రళయదినం నాడు) సంపద వల్ల గానీ, సంతానం వల్లగానీ ఏ లాభమూ కలగదు. ఏ వ్యక్తి అయినా మంచి హృదయంతో అల్లాహ్ సాన్నిధ్యంలో హాజరైతే తప్ప.

(అష్ షుఅరా : 89)

## అహంకార హృదయాలు

అల్లాహ్ హద్దులను అతిక్రమించే వారినీ, శంకితులనూ, తమ వద్దకు ఏ ధ్రువపత్రమూ, ఏ ఆధారమూ రాకపోయినా అల్లాహ్ వాక్యాల విషయంలో వాదించే వారినీ మార్గ భ్రష్టత్వానికి గురిచేస్తాడు. వారి ఈ వైఖరి అల్లాహ్ దృష్టిలో, విశ్వాసుల దృష్టిలో మిక్కిలి గర్హనీయమైనవి. ఇలాగే అల్లాహ్, దురహం కారి, నిరంకుశుడూ అయిన ప్రతి వ్యక్తి హృదయానికి ముద్ర వేస్తాడు. (అల్ మూ'మిన్- 35)

## తుప్పుపట్టిన హృదయాలు

అతడికి (దుర్మార్గునికి) మా వాక్యాలు వినిపించినప్పుడు 'ఇవి పూర్వకాలపు కట్టుకథలే' అని అంటాడు. ఎంతమాత్రం కాదు. అసలు వారి హృదయాలకు వారి దుష్కార్యాల తుప్పు పట్టింది. (ముతఫ్ఫిఫీన్ : 14)

## అపరాధ హృదయాలు

అపరాధుల హృదయంలోకి మేము ఈ జ్ఞాపిక (జిక్ర్)ను (ఊచలా) పోనిచ్చినా వారు దానిని విశ్వసించడం అనేది జరుగదు.

(అల్‌హిజ్ర్ : 12)

ఖుర్‌ఆన్‌లో పేర్కొనబడిన వివిధ రకాల హృదయాలివి. వివిధ సందర్భాలనుబట్టి తిరస్కారుల వివిధ వైఖరులను బట్టి పలురకాల హృదయాల గురించి అల్లాహ్ ప్రస్తావించాడు. వీటిలో అల్లాహ్ ఆదేశానుసారం నడుచుకునే మంచి హృదయాలూ ఉన్నాయి. ధిక్కార వైఖరిని అవలంభించే తలబిరుసు హృదయాలూ ఉన్నాయి.

దైవాదేశాలను పాటించే విశ్వాసుల హృదయాలు ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటాయి. దైవసూచనలతో గుణపాఠం నేర్చుకుని రుజుమార్గంపై ఉండటానికి ప్రయత్నిస్తాయి. దైవనామ స్మరణలో లీనమై దైవప్రసన్నత చూరగొనేందుకు పరితపిస్తాయి. అల్లాహ్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఆ హృదయాలు కంపించిపోతాయి. నిరంతరం తమను దైవ మార్గంలో ఉంచమని ప్రార్థిస్తూ ఉంటాయి. దానికి వ్యతిరేకంగా అవిశ్వాస హృదయాలు మార్గభ్రష్టతలో తచ్చాడుతుంటాయి.

సత్య మేదో అసత్యమేదో, రుజుమార్గమేదో, వక్ర మార్గమేదో వారికి స్పష్టంగా వివరించినా అంగీకరించడానికి సిద్ధంగా ఉండరు. వారు చేసిన అపరాధాలు, పాపాలు, నేరాల వల్ల వారి హృదయానికి తుప్పుపట్టిపోతుంది. దైవ నిదర్శనాలను తిరస్కరించిన అలాంటి హృదయాలపై అల్లాహ్ ముద్రవేస్తాడు. వారు మంచిని, సత్యాన్ని వినే స్థితిలో ఉండరు. వారు చేసిందే వారికి సత్యమనిపిస్తుంది. వారు చేస్తున్న పాపకార్యాలు వారికి పుణ్యా లుగా కానవస్తాయి. అలాంటి వారే కళ్ళున్న అంధులు, చెవులున్న చెవిటివారు, నోరున్న మూగవారు. ఇలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదని ప్రార్థిద్దాం. మన హృదయాలు ఎప్పుడూ దైవనామ స్మరణ చేస్తూ ఉండాలని ఆ అల్లాహ్‌ను వేడుకుందాం. ○

# ప్రభుత్వ ఉపకార వేతనాలు

విద్యార్థులకు స్కాలర్‌షిప్, పూర్తి ఫీజు రీఎంబర్స్‌మెంట్ మీద సరైన అవగాహన లేకపోవటంతో కొందరు దీనికి దరఖాస్తు చేయడంలేదు. ప్రభుత్వం ఇతర స్కాలర్‌షిప్‌లకు (యస్.సి, యస్.టి, బి.సి) ప్రచారం చేస్తున్న విధంగా మైనార్టి స్కాలర్‌షిప్‌ల విషయంలో దృష్టిసారించడంలేదు.



అబ్దుల్ మలిక్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లిం విద్యార్థులకు స్కాలర్‌షిప్, పూర్తి ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకాన్ని 2008 విద్యా సంవత్సరం నుండి ప్రవేశపెట్టాయి. దీనిద్వారా ఇప్పటికే అనేకమంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. అయితే ఇప్పటికీ పనిమీద సరైన అవగాహన లేకపోవటంతో కొందరు దీనికి దరఖాస్తు చేయడం లేదు. ప్రభుత్వం ఇతర స్కాలర్‌షిప్‌లకు (యస్.సి, యస్.టి, బి.సి) ప్రచారం చేస్తున్న విధంగా మైనార్టి స్కాలర్‌షిప్‌ల విషయంలో దృష్టిసారించడంలేదు. తెలుగులో అంతగా ప్రచారం లేనందు వల్ల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు దరఖాస్తులు చేయటం లేదు.

2010-11 సంవత్సరానికి గాను ముస్లిం విద్యార్థులకు సెంట్రల్ స్కాలర్‌షిప్, మెరిట్ కమ్ మీన్స్, స్టేట్ స్కాలర్‌షిప్ 3 రకాల స్కాలర్ షిప్‌లు ఉన్నాయి. సెంట్రల్ స్కాలర్‌షిప్, మెరిట్ కమ్ మీన్స్ నోటిఫికేషన్ ఇటీవలె విడుదలయింది.

సెంట్రల్ స్కాలర్‌షిప్ (గవర్నమెంట్ ఆఫ్ ఇండియా స్కాలర్‌షిప్); దీనిలో రెండు రకాల స్కాలర్‌షిప్ కలవు.

1) ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు 2) పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు

**ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్**

1) ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలో ఒకటి నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
2) తహసిల్దార్ ఇచ్చిన (ఒక లక్ష లోపు) ఆదాయ ధృవపత్రం వుండవలెను.
3) గత ఏడాది 50% మార్కులతో పాస్ అయి ఉండవలెను.
4) విద్యార్థికి బ్యాంక్ ఎకౌంట్ (నేషనల్ బ్యాంక్) తప్పనిసరిగా ఉండవలెను.

**పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్**

1) ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ కాలేజీలలో ఇంటర్ నుండి పి.హెచ్.డి వరకు చదువుతున్న విద్యార్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు.
2) తహసిల్దార్ ఇచ్చిన (రెండు లక్షలలోపు) ఆదాయ ధృవపత్రం వుండవలెను.

స్టేట్ స్కాలర్‌షిప్ :(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేద ముస్లిం విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్) దీనిలో రెండు రకాల స్కాలర్‌షిప్‌లు కలవు. దీని ధరఖాస్తులు ఆన్‌లైన్‌లో మాత్రమే చేయవలెను.

## ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్

1) ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలో 6 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు దర ఖాస్తు చేసుకోవచ్చు.
2) తహసిల్దార్ ఇచ్చిన (ఒక లక్షలోపు) ఆదాయ సర్టిఫికెట్ వుండవలెను.
3) విద్యార్థికి బ్యాంక్ ఎకౌంట్ (నేషనల్ బ్యాంక్) తప్పనిసరిగా ఉండవలెను.

## పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్

1) ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ కాలేజీలలో ఇంటర్ నుండి పీ.జి వరకు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
2) తహసిల్దార్ ఇచ్చిన (ఒక లక్షలోపు) ఆదాయ సర్టిపికెట్ వుండవలెను.
3) విద్యార్థికి బ్యాంక్ ఎకౌంట్ (నేషనల్ బ్యాంక్) తప్పనిసరిగా ఉండ వలెను.
4) ప్రొఫెషనల్ విద్యార్థులు కన్వీనర్ కోటా ద్వారా చేరిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చు.

3) గత ఏడాది 50% మార్కులతో పాస్ అయి ఉండవలెను. .
4) కన్వీనర్ కోటా లేదా మెనేజ్‌మెంట్ ద్వారా చేరిన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
5) విద్యార్థికి బ్యాంక్ ఎకౌంట్ (నేషనల్ బ్యాంక్) తప్పనిసరిగా ఉండవలెను.
6) భారతదేశంలో ఎక్కడ చదువుతున్న వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు.

**మెరిట్ కమ్ మీన్స్; (మెరిట్ విద్యార్థులకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకం)** దేశవ్యాప్తంగా 73 కోర్సులకు మాత్రమే స్కాలర్‌షిప్ ఇస్తుంది. ఇందులో ఇంజినీరింగ్, ఎమ్.బి.బి.యస్, బీ.పార్మసి, ఇతర ప్రొఫెషనల్ (వృత్తివిద్య) కోర్సులు వున్నాయి.

1) తహసిల్దార్ ఇచ్చిన 2.50 లక్షలలోపు ఆదాయ సర్టిఫికెట్ వుండవలెను.
2) గత ఏడాది 50% మార్కులతో పాస్ అయి ఉండవలెను.
3) విద్యార్థికి బ్యాంక్ ఎకౌంట్ (నేషనల్ బ్యాంక్) తప్పనిసరిగా ఉండవలెను.
4) కన్వీనర్ కోటా లేదా మెనేజ్‌మెంట్ ద్వారా చేరిన విద్యార్థులు దరఖాస్తు చేసుకో వచ్చు.
5) భారతదేశంలో ఎక్కడ చదువుతున్న వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రభుత్వం ప్రకటించిన సెంట్రల్ స్కాలర్ షిఫ్ (ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్), మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు అన్‌లైన్ చేయవలెను. అన్‌లైన్ చేయటానికి చివరి తేది: 31-07-10

ఆన్‌లైన్ చేసిన పోస్టు, ప్రీ మెట్రిక్ దరఖాస్తులు సంబంధిత సర్టిఫికెట్స్ జత చేసి జిల్లా మైనార్టీ కార్యాలయానికి, మెరిట్ కమ్ మీన్స్ దరఖాస్తులు హజ్‌హౌస్ హైద్రాబాద్‌కు పంపవలెను. ధరఖాస్తులు చేరుటకు చివరితేది: 05-08-10.

విద్యార్థులు తమ కౌన్సిలింగ్ జరగక పోవటం వల్ల తాము ఏ కాలేజీలలో చేరరు. అలాంటి వారు కూడా జూలై 31 తేది వరకు తమ పదవ తరగతి హాల్ టికెట్ నెంబర్, ఇతర వివరాలు ఎంటర్ చేసి తమ పేరును రిజిస్టర్ చేసుకొని తనకు లభించిన టోకెన్ నెంబర్ ఆధారంగా దానిని తరువాత ఎడిట్ చేసే అవకాశం కొన్నిరోజుల వరకు వుంటుంది. ముఖ్యంగా ఉద్యోగస్తుల విద్యార్థులు పోస్టుమెట్రిక్, మెరిట్ కమ్ మీన్స్ దరఖాస్తులు తప్పనిసరిగా చేసుకోగలరు.

పైన చూపిన స్కాలర్‌షిప్ వివరాలు ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. ప్రకటించిన అనంతరం మార్పులు చేర్పులు వుండవచ్చు.

**నోట్ :**

విద్యార్థి కేవలం స్టేట్ లేదా సెంట్రల్ ఏదైనా ఒకే ఒక స్కాలర్‌షిప్ చేయవచ్చు. ఇది తప్పనిసరిగా గమనించవలెను.

విద్యార్థులు ఇతర వివరాల కొరకు www.apsmfc.com వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోగలరు. మరిన్ని వివరాల కొరకు అబ్దుల్ మలిక్ (డిస్ట్రిక్ట్ ఇన్‌ఛార్జి) హైదరాబాద్ జకాత్ చారిటబుల్ ట్రస్ట్, ఖమ్మం, ఫోన్ నెంబర్ 98665 56876 ద్వారా సంప్రదించవచ్చు.